క్లుప్తంగా

లక్ష్మీదేవికి గాజుల అలంకరణ



కొత్తపేట: ఆత్రేయపురం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్ష్మీదేవిని గాజులతో అలంకరించారు. ఆలయ చైర్మన్ పాతపాటి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకుడు గోరింట విజయకుమార్‌రాజు పర్యవేక్షణతో ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవన్‌దీక్షితులు, పెద్దింటి రవికృష్ణ అమ్మవారికి గాజులు అలంకరణ జరిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో మహిళలు పాల్గొని సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

బ్యాటరీ కార్లు ప్రారంభం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం దాత బహూకరించిన రెండు బ్యాటరీ కార్లను శుక్రవారం ప్రారంభించారు. స్వామి దర్శనానికి వచ్చే వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం మెర్లపాలెంకి చెందిన జేఎస్ఎన్ రాజు కన్‌స్ట్రక్షన్స్ అధినేత జంపన సూర్యనారాయణరాజు రూ.12 లక్షలు విలువైన రెండు బ్యాటరీ కార్లు సమకూర్చారు. ఈ సందర్భంగా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు ఆధ్వర్యంలో దాత సూర్యనారాయణరాజును ఘనంగా సత్కరించారు.

పేకాడుతున్న నలుగురి అరెస్టు

పి.గన్నవరం: మండలంలోని నాగుల్లంక శివారు గుడ్డాయలంకలో శుక్రవారం రాత్రి దాడులు చేసి పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పి.గన్నవరం ఎస్సై శివకృష్ణ తెలిపారు. వారి నుంచి రూ.2,600 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై వివరించారు.

ఆర్థిక సాయం

అంబాజీపేట: ముక్కామలకు చెందిన నేదునూరి నాగరాజు ఆకస్మికంగా మృతి చెందడంతో అతని కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని శుక్రవారం అందజేశారు. నాగరాజు బీదవాడు కావడంతో దహన సంస్కారాలకు ఇబ్బందులు పడుతుండటంతో గ్రామానికి చెందిన మణికంఠ ఇక్కడి విషయాన్ని మంత్రికి వివరించాడు. దాంతో మంత్రి స్పందించి నగదును మృతుడి తల్లి సత్యవతి, సోదరీమణులకు అందజేశారు. కార్యక్రమంలో నేదునూరి వీర్రాజు, ఇందుగల ఆనంద్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అయినవిల్లి: మండలంలోని అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి ఆలయంలో ఉన్న అన్నపూర్ణ ఆలయం, ముక్తేశ్వరంలో క్షణముక్తేశ్వర స్వామి వారి ఆలయం, వీరవల్లిపాలెం, నేదునూరు, విలస, సిరిపల్లి, కె.జగన్నాథపురం గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. అమ్మవారికి లక్ష కుంకుమ పూజలు, వివిధ విశేష పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని లలితా సహస్ర పారాయణ చేశారు.

మామిడికుదురు: అప్పనపల్లి గ్రామ దేవత కనక మహాలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు వరలక్ష్మీ దేవిని ఆరాధిస్తూ పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ తులా నాగరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పూజా సామాగ్రి, రూపులను అందించారు. ఆలయ అర్చకులు కళారి ఈశ్వర్ ప్రసాద్ ఆధ్వర్యంలో భాగవతుల చిన్న వరలక్ష్మీ దేవికి వైభవంగా పూజలు జరిపించారు.

పాఠశాలకు గ్రీన్ బోర్డుల బహూకరణ

పి.గన్నవరం: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండలంలోని బెల్లంపూడి (నెం.1) ప్రాథమిక పాఠశాలకు ఎంటీఎస్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, పాఠశాల ఉపాధ్యాయుడు కేశవ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక యూత్ సభ్యులు శుక్రవారం రెండు గ్రీన్ బోర్డులు బహూకరించారు. సర్పంచ్ బండి మహాలక్ష్మి, ఎస్ఎంసీ సభ్యులు నాగలక్ష్మి కలిసి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఇమామ్ హుస్సేన్ పరివారానికి నివాళి

మామిడికుదురు: సత్యం, ధర్మం, న్యాయం కోసం 72 మంది పరివారంతో పాటు తన ప్రాణాలను సైతం అర్పించిన ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్‌కు శుక్రవారం ముస్లింలు ఘనంగా నివాళులర్పించారు. ఇమామ్ హుస్సేన్ అర్బయీన్ సందర్భంగా గుండెలు బాదుకుంటూ మాతం నిర్వహించారు. నగరం బడేబీబీ పంజాలో ఈ సందర్భంగా మజ్లిస్ జరిగింది. గుర్రంపై పీరును ఊరేగిస్తూ మాతం నిర్వహించారు. మంజిలే కర్బలాలో గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో అర్బయీన్ కార్యక్రమం జరిగింది. ఇస్లాం మతం ఉనికిని పరిరక్షించిన ఇమామ్ హుస్సేన్, అతని తనయుడు జైనుల్ ఆబేదీన్, సోదరి బీబీ జైనబ్‌కు అంజలి ఘటించారు. కత్తులు, బ్లేడులతో శరీరాలను గాయపర్చుకుంటూ హుస్సేన్.. హుస్సేన్ అని నినదిస్తూ రక్తం చిందించారు. అనంతరం మామిడికుదురు వరకు పీరును ఊరేగించారు. హజరత్ అబ్బాస్ పంజాలో మజ్లిస్ జరిగింది. నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శిబిరం ద్వారా ముస్లింలకు వైద్య సేవలందించారు.

మది నిండా.. మువ్వన్నెల జెండా

- వాడవాడలా జాతీయ జెండా రెపరెపలు
- స్వాతంత్ర్య పోరాట యోధులను స్మరించుకున్న ప్రజలు
- ఘనంగా జెండా పండగ



మలికిపురం పార్టీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేసిన గొల్లపల్లి సూర్యారావు



జాతీయ జెండాను ఎగురవేసిన జగ్గిరెడ్డి

కొత్తపేట: నియోజకవర్గంలో స్వాతంత్ర్య దిన వేడుకలు అంబరాన్ని అంటాయి. స్థానిక రెవెన్యూ డివిజనల్ కార్యాలయం వద్ద ఆర్‌డీఓ శ్రీకర్, సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయం వద్ద డీఎస్పీ సుంకర మురళీమోహన్ మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాలను ఎగురవేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద పరిపాలనాధికారి ఎంహెచ్ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. అలాగే ఎంఈఓ కార్యాలయం వద్ద, వానపల్లి, అవిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద, పలివెల వైఎస్సార్ సీపీ స్థూపం వద్ద ఎంపీపీ గంగాధరరావు జాతీయ పతాకాలను ఎగురవేశారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తి కావాలి

స్వాతంత్ర్య పోరాటంలో మహనీయుల త్యాగాలు నేటి యువతకు స్ఫూర్తి కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పిలుపునిచ్చారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శుక్రవారం డివిజన్, నియోజకవర్గ కేంద్రం కొత్తపేట సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో విద్యార్థులతో కలిసి మహాత్మా గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాకు వందనం చేశారు. ఆయన మాట్లాడుతూ, నాడు స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని నేటి తరం యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్ ప్యాకెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ సీనియర్ నాయకుడు ముసునూరి వెంకటేశ్వరరావు, సర్పంచ్ చంటి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: స్వాతంత్ర్య దిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, తాజా ప్రెస్‌క్లబ్ వద్ద అధ్యక్షుడు పళ్ల సూర్యప్రకాశరావు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారిల ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఎగురవేశారు. గ్రామాల్లోని ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎస్ఎంసీ చైర్మన్‌లు జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎంఈఓలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రావులపాలెం: స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా రావులపాలెం కళావెంకట్రావు సెంటరులో మెయిన్ లైటింగ్ పోల్‌కు త్రివర్ణ పతాకం లైటింగ్‌ను శుక్రవారం జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. రావులపాలెం పంచాయతీ తరఫున ఏర్పాటు చేసిన త్రివర్ణ పతాకం లైటింగ్‌ను జగ్గిరెడ్డితో పాటు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ బొక్కా కరుణాకరం స్విచ్ ఆన్ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ వల్లీబాబు, బొక్కా ప్రసాద్, వాకులరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్య, క్రీడల్లో రాణించాలి

విద్యార్థి దశ నుంచే విద్యతోపాటు క్రీడా రంగంలోనూ రాణించి మంచి గుర్తింపు తెచ్చుకోవాలని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి అన్నారు. అంబాజీపేట, గంగలకుర్రు జెడ్పీ హైస్కూల్‌లో చదువు, క్రీడల్లో ప్రతిభ కనబర్చిన వారికి శుక్రవారం ప్రోత్సాహక మెమెంటోలను శుక్రవారం అందజేశారు. అరిగెల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ పేరున స్థానిక హైస్కూల్‌లో పరిధిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి, మాచవరం లక్ష్మీ భారతి కాన్వెంట్‌లో విద్యార్థులకు బహుమతులను బలరామమూర్తి అందజేశారు. ఇటీవల జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు మెమెంటో ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొర్లపాటి వెంకటేశ్వరరావు, హెచ్ఎం కడలి సాయిరామ్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: మహనీయుల అడుగుజాడల్లో అందరూ పయనించి దేశాభివృద్ధికి పాటుపడాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. పోతవరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద మండల శాఖ అధ్యక్షుడు యన్నాబత్తుల ఆనంద్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను గన్నవరపు ఎగురవేశారు. పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, నక్కా వెంకటేశ్వరరావు, దొమ్మేటి దుర్గారావు పాల్గొన్నారు.

కొత్తపేట: స్వాతంత్ర్యాన్ని ఎందరో త్యాగధనుల పోరాటంతో సాధించుకున్నామని, ప్రతి ఒక్కరూ వారి స్ఫూర్తితోనే ముందుకు సాగాలని వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద జగ్గిరెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అలాగే రావులపాలెం సెంటరులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిర్ల సోమసుందరరెడ్డి, మాజీ మంత్రి కళావెంకట్రావు విగ్రహాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచులు తాడేపల్లి నాగమణి, అంబటి సుబ్బలక్ష్మి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బొక్కా కరుణాకరం, పార్టీ జిల్లా యాక్టివిటీ కార్యదర్శి షేక్ వల్లీబాబు, ఐటీ వింగ్ కొత్తపేట నియోజకవర్గ అధ్యక్షుడు కొవ్వూరి సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజోలు : స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో త్యాగధనులు శ్రమించి ప్రాణాలు కోల్పోయారని, వారి కష్టాలను భావితరాలకు చెప్పాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం రాజోలులోని పొదలాడ సెంటరులో వైఎస్సార్ విగ్రహం వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, గ్రామ శాఖ అధ్యక్షుడు దొమ్మేటి సోమరాజు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమరయోధులకు ఘన నివాళి



పుష్పాలంకరణలో వాడపల్లి స్వాతంత్ర్య సమరయోధుల స్తూపం

కొత్తపేట: స్వాతంత్ర్యోద్యమ చరిత్ర పుటల్లో ప్రత్యేక స్థానం పొందిన వాడపల్లిలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. వాడపల్లి ఆలయం వద్ద ఉన్న సమరయోధుల స్మారక స్తూపాన్ని ఈఓ నల్లం సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం అక్కడ జాతీయ పతాకాన్ని ఎమ్మెల్యే సత్యానందరావు ఆవిష్కరించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు స్తూపం వద్ద ఘనంగా నివాళులర్పించారు.



కొత్తపేటలో విద్యార్థులకు బిస్కెట్ ప్యాకెట్స్ ఇస్తున్న జగ్గిరెడ్డి

రాజోలు : స్వాతంత్ర్య దిన వేడుకలను మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు కోర్టు కాంప్లెక్స్ ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలరాణి జాతీయ జెండాను ఎగురవేశారు. అలాగే రాజోలు బార్ అసోసియేషన్ వద్ద బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, మాజీ ఏజీపీ యర్రంశెట్టి అయ్యప్పనాయుడు జాతీయ జెండాను ఆవిష్కరించారు. రాజోలు శాఖా గ్రంథాలయం వద్ద లైబ్రేరియన్ కె.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ రేవు జ్యోతి జాతీయ జెండాను ఎగురవేసి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో విద్యార్థులు పాల్గొన్నారు.

మలికిపురం: గ్రామంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండా ఎగురవేశారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ, నేడు మనం స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నామంటే అనేక మంది త్యాగధనుల పోరాట పటిమ అని అన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చిన్నరాజా, నాయకులు కేఎస్ఎన్ రాజు, పాటి శివ కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు అడబాల బ్రహ్మాజీ, సర్పంచ్ రాజ్యలక్ష్మి, ఎంపీటీసీ సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: మండల వెలుగు, మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దివ్వి భవానీ జాతీయ జెండా ఎగురవేశారు. ఏపీఎం షేక్ సయిద్ మాట్లాడుతూ, బ్రిటిష్ వారి పరిపాలన నుంచి విముక్తికి ఎందరో కృషి చేశారని, స్వాతంత్ర్య వీరుల త్యాగ ఫలితంగా మనం స్వేచ్ఛగా ఉన్నామన్నారు.

మామిడికుదురు: దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయులను స్మరించుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. నగరం ఏఎంసీ కార్యాలయం వద్ద ఆయన శుక్రవారం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ కుసుమ వనజకుమారి, పోలీస్ స్టేషన్ వద్ద ఎస్సై ఎ.చైతన్యకుమార్, మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఎమ్మార్వో పి.సునీల్‌కుమార్ జాతీయ పతాకాలను ఆవిష్కరించారు.

మామిడికుదురు: మోరికి చెందిన ఏలూరి శివ వెంకట సుబ్బారావు దేశభక్తిని చాటుతూ శుక్రవారం బైక్‌పై వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మోరి నుంచి మలికిపురం, రాజోలు, మామిడికుదురు మండలాల్లోని పలు గ్రామాలను బైక్‌పై చుట్టి వచ్చారు. మామిడికుదురులో పలువురు అతడిని అభినందించారు.

సఖినేటిపల్లి: మండలంలో శుక్రవారం స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ మల్లిబాబు జాతీయ జెండా ఎగురవేశారు. తహసీల్దారు కార్యాలయం వద్ద తహసీల్దారు వెంకటేశ్వరరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. పోలీసు స్టేషన్ వద్ద ఎస్సై దుర్గా శ్రీనివాసరావు జాతీయ జెండా ఎగురవేశారు. కాగా అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. జాతీయ జెండాను ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ ఆవిష్కరించారు. వేడుకల్లో దేశ భక్తి గీతాలు ఆలపించిన స్థానిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

అయినవిల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద స్వాతంత్ర్య వేడుకలను ఎస్సై హరికోటి శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముక్తేశ్వరం ఎస్ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ సోమేశ్వరరావు జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్‌వీవీ ప్రసాద్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడులను జరిపారు. జాతీయ జెండాలతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కారాలు





ఉత్తమ సేవా పురస్కారం అందుకుంటున్న దుర్గాప్రసాద్, మట్టపర్తి

రావులపాలెం: స్థానిక పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న దుర్గా ప్రసాద్‌కు జిల్లా ఉత్తమ సేవా పురస్కారం దక్కింది. శుక్రవారం అమలాపురంలో జరిగిన వేడుకల్లో మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్ కుమార్, ఎస్పీ కృష్ణారావు తదితర అధికారులు ఈ పురస్కారాన్ని అందజేశారు. పంచాయతీకి కార్యదర్శిగా పనిచేస్తూ పారిశుధ్యం, తాగునీరు, వీధిలైట్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు పన్నుల వసూళ్లలో ఆయన చేస్తున్న కృషికి గాను ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఆయనకు సర్పంచ్ నాగమణి, ఉప సర్పంచ్ మునిరెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు. తహసీల్దారు ముక్తేశ్వరరావు, ఏపీఎం విజయ్ కూడా పురస్కారాలు అందుకున్నారు.

ఇద్దరికి సేవా పురస్కారాలు

అంబాజీపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ఇద్దరికి సేవా పురస్కారాలు లభించాయి. వక్కలంక వీఆర్వో కనకమహాలక్ష్మి, అంబాజీపేట ఏఎస్ఐ సూర్యనారాయణకు ఉత్తమ సేవా పురస్కారాలను మంత్రి సుభాష్ చేతుల మీదుగా అందుకున్నారు.

మట్టపర్తికి ఉత్తమ ఏపీవో అవార్డు

సఖినేటిపల్లి: కోనసీమ జిల్లా ఉత్తమ ఏపీఓగా సఖినేటిపల్లి మండల ఎన్ఆర్‌జీఎస్ ఏపీవోగా పనిచేస్తున్న మట్టపర్తి దుర్గా నాగ ప్రసాద్ శుక్రవారం అవార్డు అందుకున్నారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కలెక్టర్, మంత్రి సుభాష్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు అవార్డులు

సఖినేటిపల్లి: మండలంలోని ఇద్దరు రెవెన్యూ ఉద్యోగులు శుక్రవారం ఉత్తమ సేవలకు అవార్డులు అందుకున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో కలెక్టర్ చేతులు మీదుగా అంతర్వేదిపాలెం వీఆర్వో ఇంటి హరి ప్రసాద్, రామేశ్వరం వీఆర్ఏ కర్రి త్రిమూర్తులు అవార్డులు తీసుకున్నారు.

వాడపల్లి దేవస్థానం సూపరింటెండెంట్‌కు ఉత్తమ అవార్డు

ఆత్రేయపురం మండలం వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానం సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబుకు ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం అందజేయడంతో కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

కొత్తపేట: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన పలువురు అధికారులు, సిబ్బందికి ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవా పురస్కారాలు అందజేసింది. దానిలో భాగంగా కొత్తపేట ఆర్‌డీఓ శ్రీకర్‌కు అమలాపురం కలెక్టరేట్‌లో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్ చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. అలాగే ఆర్‌డీఓ కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్ ప్రభాకరరావు, డీటీపీ సుబ్రహ్మణ్యం, ఆర్డీఓ సీసీ వాసంశెట్టి వెంకటేష్, గ్రామ సర్వేయర్ శ్రీరామ్, కంప్యూటర్ ఆపరేటర్ గణేష్ కొత్తపేట డివిజన్ ఉద్యాన అధికారిగా పనిచేస్తున్న కోటేశ్వరరావు అవార్డు అందుకున్నారు.

లో వోల్టేజీ సమస్యకు పరిష్కారం

మలికిపురం: గూడపల్లిలో లో వోల్టేజీ సమస్య పరిష్కారమైందని సర్పంచ్ పెదపాటి సత్యనారాయణ అన్నారు. గూడపల్లి యాదవులు గ్రూప్‌లో ఏర్పాటు చేసిన 63 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుందర శ్రీనివాసరావు, సొసైటీ ప్రెసిడెంట్ పున్నం గంగారావు, వైఎస్సార్ సీపీ యూత్ విభాగ నాయకులు మోకా సురేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

అమలాపురం టౌన్: స్థానిక ఎన్టీఆర్ మార్గ్‌లోని ప్రాంతీయ పశు వైద్యశాల వద్ద దాతల సహకారంతో నిర్మించిన చిన్న మూగ జంతువుల ఆపరేషన్ థియేటర్‌ను జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కె.వెంకట్రావు, ఉప సంచాలకుడు మూర్తి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ దాతలు దాదాపు రూ.60 వేలు సమకూర్చి చిన్న మూగ జంతువుల కోసం శస్త్రచికిత్స హాలును ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. దీనివల్ల కుక్కలు, గొర్రెలు, మేకలకు ఏదైనా జబ్బులు చేస్తే సునాయాసంగా శస్త్రచికిత్సలు చేసేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. దాతలు రామాయణం సురేష్, గ్రంధి సతీష్, గుప్తా, జయంతి లాల్‌జాన్‌లను పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు ఎల్.విజయరెడ్డి అభినందించారు. పశు వైద్యాధికారులు మేడిద నారాయణమూర్తి, పూర్ణిమ, కావ్య, మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

సెంట్రల్ వర్సిటీలో సీటు కైవసం



చప్పిడి మౌర్య

పి.గన్నవరం: మండలంలోని ఆర్.ఏనుగుపల్లి గ్రామానికి చెందిన చప్పిడి మౌర్య సంజీవ వర్ధన్ ప్రతిభ కనబరిచి సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ ఆఫ్ ఏపీ (సీటీయూ) విజయనగరం కళాశాలలో సీటు సాధించాడు. ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన సెంట్రల్ యూనివర్సిటీ కామన్ టెస్ట్ (సీయూఈటీ)లో అత్యధిక మార్కులు సాధించాడు. దీంతో సీటీయూ విజయనగరం కళాశాలలో బీఎస్సీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్ స్పెషలైజేషన్ సీటును సాధించినట్టు విద్యార్థి తల్లిదండ్రులు చప్పిడి కిరణ్మయి, శ్రీరామశెట్టి విలేకరులకు తెలిపారు.

అలరించిన నాటిక



కొత్తపేట ప్రియదర్శినిలో నాటికలు ప్రదర్శించిన విద్యార్థులు

కొత్తపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ప్రియదర్శినీ బాల విహార్ విద్యార్థులు జాతీయోద్యమ ఘట్టాలను ఆంగ్లంలో ప్రదర్శించి విశేషంగా అలరించారు. సంస్థ కరస్పాండెంట్ అద్దంకి బుద్ధ చంద్రదేవ్ ఆధ్వర్యంలో అకడమిక్ డైరెక్టర్ అద్దంకి సాహిత్య రూపొందించిన 1958 సిపాయిల తిరుగుబాటు, 1919 జలియన్ వాలాబాగ్ సంఘటన, 1942 క్విట ఇండియా ఉద్యమం, 1947 స్వాతంత్ర్యం పొందడం, 1949 రాజ్యాంగం ఏర్పాటు తదితర ఘట్టాలను వేదికపై ప్రదర్శనతో వివరించారు. గాంధీజీ, అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ, మంగల్ పాండే, ఝాన్సీలక్ష్మి భాయ్, లాలా లజపతిరాయ్, సుభా స్ చంద్రబోస్, భగత్ సింగ్, సరోజినీ నాయుడు, వల్లభాయ్ పటేల్, మౌలానా అబు కలామ్ అజాద్ తదితర జాతి నాయకులు, పోరాట యోధుల వేషధారణలతో 35 మంది విద్యార్థులు అద్భుతంగా పోషించారు. రాజమహేంద్రవరానికి చెందిన ప్రతేక మెకప్ ఆర్టిస్ట్ సుధీర్ బృందం మేకప్‌తో ఆహార్యాన్ని సమకూర్చారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన కాట్రేనిపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులకు రూ.90 వేల నగదు ప్రోత్సహకాలను శుక్రవారం అందజేశారు. ప్రథమస్థానం సాధించిన నక్కా వైష్ణవికి ఇంటర్మీడియేట్ రెండు సంవత్సరాల ఫీజు నిమిత్తం రూ.50 వేలు, అలాగే ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు నగదు అందజేశారు. నగదు ప్రోత్సహకాల దాత చిన్నిమిల్లి వెంకటరమణ కుమారి రూ.50 వేలతోపాటు గ్రామానికి చెందిన పలువురు రూ.40 వేలు సమకూర్చారు.

సంపూర్ణ పారిశుధ్యానికి చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందుకు ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు లక్ష్మీస్నేహ, బి.అనంత రామకృష్ణ, డి.సాయికిషోర్, కె.భాగ్యశ్రీ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశా సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, పి.శివప్రసాద్ తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.